క్లుప్తంగా

స్విమ్మింగ్ కోచ్‌గా సురేష్



ఏలూరు రూరల్: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ స్విమ్మింగ్ కోచ్‌గా జి.సురేష్ గురువారం విధుల్లో చేరారు. బిశ్వనాథ్ భర్తియా స్విమ్మింగ్ పూల్ బాల బాలికలకు శిక్షణ అందిస్తారని జిల్లా చీఫ్‌కోచ్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటి వరకు పనిచేసిన కోచ్ గణేష్ పదవీ విరమణ చేసిన విషయం విదితమే. ఆయన స్థానంలో సురేష్ ప్రతిరోజూ ఉదయం, సాయంత్ర వేళ బాధ్యతలు నిర్వహించనున్నారని చెప్పారు.

వచ్చే నెలలో కాపు విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ఏలూరు (టూటౌన్) : 2022–23 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో 900కి పైగా, పదో తరగతిలో 500కి పైగా మార్కులతో ఉత్తీర్ణులైన ఏలూరు నగరానికి చెందిన కాపు విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించనున్నట్టు కాపు సంక్షేమ సేన ఏలూరు జిల్లా అధ్యక్షుడు పులి శ్రీరాములు ఒక ప్రకటనలో తెలిపారు. 100 మంది విద్యార్థులకు రజిత పతకాలు వచ్చే నెలలో అందిస్తామని వెల్లడించారు. పైలట్ ప్రాజెక్టుగా ముందు ఏలూరులో అమలు చేస్తామని, క్రమంగా జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని తెలిపారు. ఏలూరు నగరానికి చెందిన కాపు విద్యార్థులు ఇంటిపేరుతో పూర్తి చిరునామా, వాట్సాప్ నెంబరుతో వివరాలను సెల్ నెంబరు 79892 18336కు ఈ నెల 30లోగా పంపించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని సత్రంపాడు, ఆర్టీసీ 11 కేవీ ఫీడర్స్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం నగరంలో శుక్రవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సౌభాగ్యలక్ష్మి ఆలయం, ఆర్టీసీ కాలనీ, ఆర్టీసీ బస్టాండు ప్రాంతం, నరసింహారావుపేట, కలెక్టర్ కార్యాలయ ప్రాంతం, అమీనాపేట, ఏటిగట్టు ప్రాంతం, గ్రాండ్ ఆర్యరోడ్డు ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

ఎంఈఓ–2గా అన్నమ్మ

దెందులూరు: దెందులూరు మండల విద్యాశాఖాధికారి–2గా అన్నమ్మ గురువారం ఎంఈఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ద్వారకాతిరుమల నుంచి బదిలీపై దెందులూరు విచ్చేశారు. జాతీయస్థాయిలో జరిగిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు, నగదు బహుమతి ఎంఈఓ అన్నమ్మ అందచేశారు.

సెల్‌ఫోన్ పోయిందా.. డోంట్ వర్రీ

నాడు ''సెల్‌ఫోన్ పోయింది సార్.. అంటూ గతప్రభుత్వం హయాంలో పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళితే పట్టించుకున్న నాధుడే లేడు. తెలిసిన వాళ్లతో చెప్పించినా పెద్దగా ఒరిగేదీ ఏమీ లేదు. సెల్‌ఫోన్ పోతే ఫిర్యాదు చేసేందుకు వీలుండేది కాదు. సెల్‌ఫోన్ పోతే తాము ఏమీ చేయలేమని, ఫిర్యాదు ఇచ్చినా కేసు నమోదు చేయలేమని పోలీస్ అధికారులు బాహాటంగానే చెప్పేసేవారు. రికవరీ మాట అటుంచి కేసు నమోదు చేయని దుస్థితి.''

నేడు ''సెల్‌ఫోన్ పోయిందా.. డోంట్ వర్రీ.. అంటూ పోలీసులే భరోసా ఇస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌కు రానక్కరలేదు. పోలీస్ సైబర్ క్రైమ్ సెల్ వాట్సాప్ నెంబర్‌కు వివరాలు ఇస్తే చాలు. మీ సెల్‌ఫోన్ వెతికిమరీ మీకు అప్పగిస్తామని చెబుతున్నారు. ఏలూరు జిల్లా పోలీసులు తమ ప్రతిభను చాటుకుంటున్నారు. రూపాయి ఖర్చు లేకుండా పోలీసులే వెతికి మరీ ఫోన్లు తెచ్చి ఇస్తున్నారు. ఇప్పటికే ఏడు సార్లు సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు ఇచ్చారు.''

- వాట్సాప్ నెంబర్ 95503 51100లో హాయ్ అని టైప్ చేస్తే చాలు
- ఏడు ఫేజుల్లో రూ.1.69 కోట్ల విలువైన ఫోన్ల రికవరీ
- జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రతిభకు నిదర్శనం

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లా వ్యాప్తంగా మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల మోములో చిరునవ్వులు చిందిస్తున్నారు పోలీసులు. జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ నేరాల అదుపునకు విశేష కృషి చేస్తున్నారు. ఏలూరు డీఎస్పీ ఇ.శ్రీనివాసులు, ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ, సైబర్ సెల్ ఎస్సై రాజా, పోలీస్ బృందం అత్యుత్తమ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ సెల్‌ఫోన్లు రికవరీ చేస్తున్నారు. ఏడు దశల్లో 821 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేయటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

58 శాతం రికవరీ:

ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఏడు దశల్లో భారీగా మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. గత ఏడాది కాలంగా జిల్లాలో సైబర్‌క్రైమ్, నేరాల దర్యాప్తులో ఏలూరు జిల్లా పోలీసులు తమ శక్తిని చాటుకుంటున్నారు. తమ సెల్‌ఫోన్లు చోరీ లేదా పోయాయంటూ వాట్సాప్ నెంబర్‌కు ఫిర్యాదు చేయగా 58 శాతం రికవరీ చేయటం విశేషం.

ఫోన్ పోగొట్టుకున్నారా.. వాట్సాప్‌లో నమోదు చేయండి

మీ మొబైల్ పొగొట్టుకున్నా.. చోరీ చేసినా.. వెంటనే వాట్సాప్ నెంబర్ 95503 51100 మీవద్ద ఉంటే చాలు.. పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగాల్సిన పనిలేదు. ఏలూరు జిల్లా పోలీసులు ఎంతో ప్రతిష్టాత్మకంగా సైబర్ సెల్ ఏర్పాటు చేసి ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నారు.

- ముందుగా 95503 51100 ఫోన్ నెంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని టైప్ చేయాలి.
- అనంతరం ఫోన్‌లో ఒక లింక్ మీకు కనిపిస్తుంది
- లింక్‌లోకి వెళ్లగానే మిస్సింగ్ మొబైల్ ప్రొఫార్మా ఓపెన్ అవుతుంది.
- ఈ ప్రొఫార్మాలో మీ చిరునామా, వివరాలు, మొబైల్ ఫోన్ వివరాలు, ఐఎంఈఐ నెంబర్, ఫోన్ నెంబర్ పొందుపరచాలి.
- మీరు ఏ ప్రాంతంలో ఉంటున్నారు? ఎలా పోయింది? సమీప పోలీస్‌స్టేషన్ వివరాలు పూర్తి చేయాలి.
- మీ మొబైల్ ఫోన్ వెదికి పట్టుకుని, పోలీసులు మీకు ఫోన్ చేసి మరీ బాధితులకు అప్పగిస్తారు.



సెల్‌ఫోన్ బాధితులకు ఫోన్ అందజేస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి (ఫైల్)

బాధితులకు అండగా



ఏలూరు జిల్లాలోని ప్రజలకు అత్యుత్తమ స్థాయిలో పోలీస్ సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి ప్రత్యేక పర్యవేక్షణలో ఏలూరు జిల్లాలో ఏడు ఫేజుల్లో సుమారుగా రూ.1 కోటి 69 లక్షల పైచిలుకు విలువైన మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేశాం. ఇది నిరంతర ప్రక్రియ. ఎవరైనా ఫోన్లు పోయినా, చోరీకి గురైనా వెంటనే వాట్సాప్ నెంబర్‌లో వివరాలు అందిస్తూ ప్రొఫార్మా పూర్తి చేస్తే వాటిని రికవరీ చేసేందుకు పోలీసులు శక్తివంచన లేకుండా పనిచేస్తున్నారు. పోలీసులు బాధితులకు ఎల్లవేళలా అండగా ఉంటారు.

– సీహెచ్ మురళీకృష్ణ, సీఐ, ఏలూరు సీసీఎస్

ఫేజ్	ఫిర్యాదులు	సెల్‌ఫోన్ రికవరీ	విలువ	కేసులు	అరెస్టులు
ఫేజ్–1	96	80	16,00,000	03	03
ఫేజ్–2	141	94	20,50,000	–	–
ఫేజ్–3	168	108	22,00,000	–	–
ఫేజ్–4	180	103	21,21,800	07	05
ఫేజ్–5	222	116	25,66,384	02	02
ఫేజ్–6	351	207	22,40,000	03	02
ఫేజ్–7	300	113	22,60,000	02	04
	1458	821	1,69,38,184	17	16

విద్యార్థుల భవిష్యత్ కోసమే తపన

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి : విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరితపిస్తున్నారని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం మండలంలోని కూచింపూడి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఘంటాపద్మశ్రీ తో కలిసి పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య సంస్థల్లో చదివి దెందులూరు నియోజకవర్గ స్థాయిలో టాపర్స్ గా నిలిచిన పసుపులేటి గాయత్రి, దిమ్మిటి భానుస్వర్ణ, సింహం జస్వంత్ ముగ్గురు పదో తరగతి విద్యార్థులను , ఇంటర్మీడియట్‌లో అకన సుబ్రహ్మణ్యం, లక్కపాము కమలాకర్, పైడి గుణరాధిక, బుడిపూడి చిరంజీవి నలుగురు విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డులతో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సత్కరించారు. వీరితోపాటు కూచింపూడి పాఠశాలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన దిమ్మిటి భానుస్వర్ణ, కటకం జాహ్నవి, జమ్మి నవ్యశ్రీ, కలతోటి జాన్‌రాబిన్‌సన్‌లను ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి గారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ, ఎక్కడా అమలు కానీ పథకాలు అందిస్తూ రూ.60,329 కోట్ల నిధులు అందించి రాష్ట్రంలో విద్యా వ్యవస్థను సమూలంగా మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, పెదవేగి సొసైటీ అధ్యక్షులు పెనుమాక వెంకట సుబ్బారావు, సర్పంచ్ సొంగ ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు కాలి చినబుజ్జి, డీవైఈఓ బి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



టెన్త్‌లో నియోజకవర్గ టాపర్‌గా నిలిచిన గాయత్రిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

అగ్నిప్రమాద బాధితులకు సాయం

ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకుని అండగా నిలుస్తానని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి గ్రామంలో గురువారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో అలుగుల మరియదాసుకు చెందిన తాటాకుల ఇల్లు పూర్తిగా కాలిపోయింది. విద్యుదాఘాతంతో ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు తెలిపారు. ప్రమాదం సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, స్థానిక తహశీల్దార్ ఎన్ నాగరాజు, వైసీపీ నాయకులు తాతా సత్యనారాయణ, పెదవేగి ఎస్సై లక్ష్మణ్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగితెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి తక్షణ సహాయం క్రింద రూ.10,000 వేల నగదు, 25 కేజీల బియ్యం, 5 కేజీల కందిపప్పు, 2 కేజీల పంచదార అందజేశారు.

ఫలించిన జూట్ కార్మికుల పోరాటం

పరిహారం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకారం

ఏలూరు (టూటౌన్) : ఏలూరు జూట్ మిల్లును చట్టబద్ధంగా మూసివేసిన నేపథ్యంలో కార్మిక యూనియన్లు నిర్వహించిన పోరాటాలు ఫలించాయి. కార్మికులకు పరిహారం చెల్లించేందుకు యాజమాన్యం, యూనియన్లకు మధ్య గురువారం జేసీఎల్ ఎ.రాణి సమక్షంలో ఒప్పందం కుదిరింది. ఆ వివరాలను స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు వెల్లడించారు. 118 సంవత్సరాల చరిత్ర గల ఏలూరుజూట్ మిల్లుకు ఈ ఒప్పందంతో తెరపడిందన్నారు. రాజీనామా చేయకుండా మిగిలిన కార్మికులకు చెల్లించాల్సిన పీఎఫ్, గ్రాడ్యుటీతో పాటు అదనంగా రెండున్నర నెలల జీతం, సంవత్సరానికి మూడు వేలు చొప్పున సర్వీసు పరిహారంగా చెల్లించేందుకు, బదిలీ కార్మికులకు 50 శాతం, టీటీ సర్వీసు కార్మికులకు 20 శాతం చెల్లించేందుకు ఒప్పందం కుదిరినట్టు చెప్పారు. గ్రాట్యుటీకి అర్హత లేని వారికి ఏడాదికి రూ.2500 చెల్లించేందుకు, 2022 జనవరి, ఫిబ్రవరి నెలలకు అర్హతనుబట్టి ఎర్నడ్ లీవ్ చెల్లించేందుకు, పీఎఫ్ నాన్ రికవరిబుల్ లోన్లపై అపరాదపు వడ్డీ రద్దుకు అంగీకరించారని వివరించారు. కోర్టు వివాదాలను ఉపసంహరించుకొనుటకు కార్మిక సంఘాలు అంగీకరించినట్లు తెలిపారు. జూట్ మిల్లు డైరెక్టర్ శివశంకర్ లునాని, పర్సనల్ మేనేజర్ ఎస్‌పి సురేష్, ఇఫ్టూ నాయకులు కె.పొలారి, బద్దా వెంకట్రావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు ఒప్పందంపై సంతకాలు చేసినట్టు చెప్పారు. యాజమాన్యానికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఇఫ్టూ కార్యకర్తలు బగాది రమణ, కొంపంగి కృష్ణ, ఎ.వరప్రసాద్, ఎ.సత్తిబాబు, ఎం.మాతయ్య, కె.శ్రీను, పీకే త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పందం వివరాలను వెల్లడిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

పిల్లలతో భిక్షాటన చేయిస్తే కఠిన చర్యలు

ద్వారకాతిరుమల : పిల్లలు, పసిబిడ్డలతో భిక్షాటన చేయిస్తే కఠిన చర్యలు తప్పవని ఒక యాచకురాలిని ఎస్సై టి.సుధీర్ గురువారం హెచ్చరించారు. వివరాలు ప్రకారం. భీమడోలుకు చెందిన యాచకురాలు వీరమ్మ క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద తన పసిబిడ్డతో భిక్షాటన చేస్తోంది. దీన్ని గమనించిన సచివాలయం–2 మహిళా పోలీస్ లక్ష్మీ సుజన 1098 ద్వారా చైల్డ్ లైన్‌కు సమాచారం అందించారు. దాంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పసి బిడ్డతో సహా, ఆ మహిళా యాచకురాలిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఎస్సై సుధీర్ ఆ యాచకురాలికి కౌన్సిలింగ్ ఇచ్చారు. మరోసారి పిల్లలతో భిక్షాటన చేయిస్తున్నట్టు తన దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించి ఆమెను విడిచిపెట్టారు. ఈ కౌన్సిలింగ్‌లో అంగన్‌వాడీ కార్యకర్త ఉన్నారు.



కౌన్సిలింగ్ అనంతరం యాచకురాలిని పోలీస్ స్టేషన్ నుంచి బయటకు పంపుతున్న పోలీసులు

ప్రమోద్‌కుమారికి సత్కారం

పోలవరం రూరల్ : పోలవరం ఐసీడీఎస్ పీవోగా పనిచేసి బదిలీపై వెళ్లిన పీఎ ఎంబీఎస్ ప్రమోద్‌కుమారిని అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం సన్మానించారు. ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆమెను సన్మానించి, చేసిన సేవలను కొనియాడారు.

రూ. 21.06 కోట్లతో 391 అభివృద్ధి పనులు పూర్తి

మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం : జగనన్న ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు జంగారెడ్డిగూడెం పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.21.06 కోట్లు వెచ్చించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి వెల్లడించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మొత్తం 391 అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. 2019–2023 వరకు సాధారణ నిధులు రూ.7,19,96,512 వెచ్చించి 219 అభివృద్ధి పనులు పూర్తిచేశామన్నారు. అలాగే 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.12,50,71,518 వెచ్చించి 160 అభివృద్ధి పనులు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1,05,87,041 వెచ్చించి 7 అభివృద్ధి పనులు చేశామన్నారు. అలాగే గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.30,09,538 వెచ్చించి 5 అభివృద్ధి పనులు పూర్తిచేశామన్నారు. దీనిలో సాధారణ నిధులు 2019 – 20వ సంవత్సరంలో రూ. 48.80లక్షలు, 2020–21లో రూ.70.06 లక్షలు, 2021–22లో రూ.2.94కోట్లు, 2022–23లో 1.11 కోట్లు, 2023 – 24లో 1.95 కోట్లతో రూ. 219 అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అలాగే 14వ ఆర్థిక సంఘం నిధులు 2019–20లో రూ.7.09లక్షలు, 2020–21లో రూ. 3.78 కోట్లు, 2021–22లో రూ. 4.37 కోట్లు, 2022–23లో రూ. 4.28 కోట్లు అభివృద్ధి పనులకు వెచ్చించామన్నారు. అలాగే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 2022–23లో రూ.75.31 లక్షలు, 2023–24లో రూ.30.56 లక్షలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. కాగా గడపగడపకు మన ప్రభుత్వానికి సంబంధించి 2023–24 సంవత్సరంలో 5 పనులు పూర్తిచేశామని, దీనికి రూ. 30.09 లక్షలు వెచ్చించినట్లు ఆమె తెలిపారు. వైస్ చైర్మన్ వాసవీరత్నం, మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్, కౌన్సిలర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ధృతరాష్టుని కౌగిలిలో పవన్ కల్యాణ్

కొయ్యలగూడెం : ధృతరాష్ట్రుడు వంటి చంద్రబాబు కౌగిలిలో పవన్ కల్యాణ్ ఉన్నాడని ఆయన్ని ఎవరూ రక్షించలేరని రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు పేర్కొన్నారు. గురువారం కొయ్యలగూడెంలోని ఆయన నివాసంలో మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో ఇప్పటివరకు ఎంతటి మేధావి అయినా రాజకీయంగా ఎదగలేదన్నారు. చంద్రబాబుతో సమానంగా టీడీపీలో ఎదుగుతూ వచ్చిన లోక్‌సభ దివంగత మాజీ స్పీకర్ జి.బాలయోగి, ఎలిమినేటి మాధవరెడ్డి, కింజరపు ఎర్రంనాయుడు, ఇలా ఎందరో ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయారని ఆ ప్రమాదాల వెనుక కుట్ర కోణాలు దాగున్నాయని ఆరోపించారు. మిడిమిడి రాజకీయ పరిజ్ఞానంతో ఉన్న పవన్ కల్యాణ్ రాజకీయ రాబందు వంటి చంద్రబాబు కౌగిలిలో నలిగిపోతాడని జోస్యం పలికారు. చంద్రబాబు అంటే వెన్నుపోటుకి, మోసానికి, అవినీతికి, వంచనకు, ద్రోహానికి మరో రూపం అని అన్నారు. భవిష్యత్తులో ప్రజలు తమ పిల్లలకు రాజశేఖర్, జగన్ అనే పేర్లు పెట్టుకుంటారే కానీ చంద్రబాబు పేరుని పెట్టుకోరంటూ ఎద్దేవా చేశారు.

దౌర్జన్యం చేసిన ఘటనలో ఏడుగురిపై కేసు

జంగారెడ్డిగూడెం : ఇంటిలోకి ప్రవేశించి దౌర్జన్యం చేసిన నేరంపై ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. మైసన్నగూడెంకు చెందిన మోటమర్రి నాగనరేంద్రరావు తల్లి, మరదలు పేర్ల మీద 171/3ఏలో 4 సెంట్ల భూమి ఉందని, 2006లో సదరు భూమికి ఇంటి పట్టాలు కూడా ఇచ్చారన్నారు. అయితే ఈ భూమి తమది అని పేర్కొంటూ అదే గ్రామానికి చెందిన బోడా నాగేశ్వరరావు, మరో ఆరుగురు కలిసి నాగనరేంద్రరావు ఇంటిలోకి ప్రవేశించి దౌర్జన్యం చేసి ఇంటి సామాగ్రి బయటకు పడవేసి చంపుతానని బెదిరించారన్నారు. బాధితుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	08–10
బెండకాయలు	30	కంద	48
పచ్చిమిర్చి	76	బీట్‌రూట్	36
కాకర కాయలు	50	కీరా దోస	46
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	50	అల్లం	220
క్యాబేజీ	24	కొత్తిమీర (కట్ట)	25–45
క్యారెట్	38	పాలకూర	10
దొండకాయలు	24	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	16	బఠాణీ	--
ఆనపకాయ (1)	15	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	15	చిలకదదుంప	20

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	23
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	28
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	21
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	24

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	14
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	30
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	32
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	--
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	30
ఏలూరు –తిరుపతి	16.00	4830	33

24న డిగ్రీ కోర్సుల ప్రవేశాలపై అవగాహన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ విద్యా విధానంలో భాగంగా 2023–24 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కోర్సుల ప్రవేశాల్లో తీసుకొచ్చిన మార్పులపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు సీఆర్ఆర్ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ కేపీ రామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న సీఆర్ఆర్ కళాశాలలోని యార్లగడ్డ కల్యాణ చక్రవర్తి ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు అవగాహన సదస్సు ప్రారంభమౌతుందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి హానర్స్ డిగ్రీ కోర్సుల్లో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని ప్రవేశపెడుతున్నారని, ఇతర మార్పులపై కూడా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసుకోవడానికి ఈ సదస్సు మంచి వేదికని రామరాజు తెలిపారు.

పోతురాజు సేవలు ఆదర్శనీయం

దెందులూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలతో పాటు రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో రజక సంఘం సమస్యల పరిష్కారం, మౌలిక వసతులు, రజక చెరువులపై హక్కుల సాధనలో విశిష్ట సేవలందించిన రజక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు యండమూరి పోతురాజు ఆకస్మిక మరణం బాధాకరమని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. గురువారం సత్యనారాయణపురం గ్రామంలో మృతి చెందిన పోతురాజు భౌతికకాయంపై కట్లయ్యతో పాటు రాష్ట్రం నుంచి పలు జిల్లాలు, ఉభయగోదావరి జిల్లాలో అనేక మండలాల్లో రజక సంఘం నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ యన చేసిన సేవలను కొనియాడి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.